పాలమూరు సమస్యలపై 25న సెమినార్:ఎన్ఆర్ఐల చొరవ

ANDHRA PRABHA

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 20; (కెఎన్ఎన్): మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రవాస భారతీయులు తమ పుట్టిన గడ్డను అభివృద్ధి పర్చడానికి నడుంబిగించనున్నారు. అందుకు నాందివాచకంగా ఈ నెల 25న ఇక్కడికి ఎడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జయప్రకాష్ ఇంజనీరింగ్ కాలేజీ భవనంలో పాలమూరు సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ సెమినార్‌లో పలువురు ఎన్ఆర్ఐలు, మేధావులు పాల్గొనున్నారని సెమినార్ నిర్వాహకులు మేరెడ్డి రవిప్రకాష్, విమల, రామచంద్రులు సోమవారం ఇక్కడ విలేఖరుల సమావేశంలో తెలియజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ రాజకీయ శాస్త్ర విభాగం మాజీ అధినేత ప్రొఫెసర్ కె.మధుసూదన్‌రెడ్డి సెమినార్‌కు అధ్యక్షత వహించనున్నారు. సీడబ్ల్యుసి మాజీ చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్‌రావు, ప్రముఖ పంపింగ్ ఇంజనీర్ పెంటారెడ్డి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రంగారెడ్డి, ఉస్మానియా ,యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి తదితరులు సెమినార్‌లో తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వారు చెప్పారు. పాలమూరు జిల్లా ఎదుర్కొంటున్న సాగునీటి, తాగునీటి, వ్యవసాయ రంగ, నిరుద్యోగ సమస్యలపై వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి పరిష్కార మార్గాలను సూచిస్తారని మేరెడ్డి రవిప్రకాష్, విమల చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ప్రవాసభారతీలు 150 మందిని తమ సంస్థ గుర్తించిందని వారు చెప్పారు. తమ సంస్థమైన పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం, పాలమూరు మేధావుల ఫోరం, తెలంగాణ అభివృద్ధిఫోరం (యుఎస్ఎ ఇండియా రాష్ట్రర్)ల తరపున ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని వారు చెప్పారు. పాలమూరు వాస్తవ్యులైన ఎన్ఆర్ఐలు మొదట తమ పుట్టిన గ్రామం, స్వస్థలాల అభివృద్ధి కోసం కృషి చేస్తారని వారు చెప్పారు. తమ పుట్టిన గ్రామాన్ని వారు దత్తత తీసుకుని మొదట విద్యపరంగా గ్రామాన్ని వృద్ధి చేస్తారని వారు చెప్పారు. ఆ తర్వాత పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం తదితర సమస్యలపై వారు దృష్టి సారిస్తారని వారు చెప్పారు.

ప్రగతికి నీరే ప్రధానం

EENADU

టి.డి.గుట్ట (మహబూబ్‌నగర్), ఫిబ్రవరి 25 (న్యూస్‌టుడే): ప్రగతికి నీరు ప్రధానమని, సాగు, తాగునీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాలే ఎక్కువగా అభివృద్ధి చెందాయని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ అర్.విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. 'జిల్లా సమస్యలు - పరిష్కార మార్గాలు' అనే అంశంపై పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం, పాలమూరు మేధావుల ఫోరం, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్ని వనరులు కల్పిస్తే సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. ఇక్కడకు రావాల్సిన నీరు మళ్లీ పోవటం వల్లే వ్యవసాయం వట్టిపోతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కర్ణాటకతో ఒప్పందం కుదుర్చుకుంటే జిల్లాకు అధిక మొత్తంలో సాగు నీరు అందే అవకాశముందన్నారు. ప్రాజెక్టుల ద్వారా నీరు సద్వినియోగమయ్యేలా చూడాలని ఆయన కోరారు. వక్తలు పెంటారెడ్డి, ఎం.వి.రంగారెడ్డి, ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి ప్రసంగించారు. సమస్యలు తెలుసుకునేందుకు జరుపుతున్న సదస్సులు అవసరమన్నారు. కార్యక్రమంలో జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాల వైస్‌ఛైర్మన్ కె.ఎస్.రవికుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీధర్‌గోపాల్, బార్ కౌన్సిల్ సభ్యుడు వి.మనోహర్‌రెడ్డి, రాఘవాచారి, బుర్రి మెంబర్రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలయజ్ఞంతో తెలంగాణకు దుర్భిక్షం

ANDHRA BHOOMI

మహబూబ్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 25: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా పోచారం, పులిచింతల, దుమ్ముగుడెం, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులు పూర్తి అయితే తెలంగాణ ప్రాంతానికి దుర్భిక్ష పరిస్థితులు తప్పవని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అర్.విద్యాసాగర్‌రావు హెచ్చరించారు. జయప్రకాష్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం, పాలమూరు మేధావుల ఫోరం, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పాలమూరు సమస్యలు -పరిష్కారం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి అందాల్సిన నిక రజలాలను నిల్వచేసుకునే సామర్థ్యం గల ప్రాజెక్టులు ప్రాంతంలో లేకపోవడంతో వరదజలాల పేర తెలంగాణ ప్రాంత నికరజలాలను ఆంధ్ర రాయలసీమ ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. కృష్ణానది 68.5శాతం తెలంగాణ జిల్లాల్లో ప్రవహిస్తుందని, పరివాహక ప్రాంత అవసరాలు తీరాకే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలని జాతీయ జలవిధానం, ఐటావత్ ట్రిబ్యునల్ చెబుతున్నా వాటిని తోసిరాజని పాలకులు కృష్ణా బేసిన్ ప్రాంతాలకు అన్యాయం చేస్తూ ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 240కిలోమీటర్ల పరివాహక ప్రాంతం ఉన్న తెలంగాణకు 34శాతం నీటి వాటాను కేటాయించి 14శాతం పరివాహక ప్రాంతంగా ఉన్న కోస్తా ఆంధ్రకు 46శాతం నీటివాటాను కేటాయించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. 34శాతం నీటివాటా కలిగిన తెలంగాణ ప్రాంతంలో 15శాతం నీటివాటాను కూడా పాలకులు వినియోగంలోకి తేలేకపోయారని వాపోయారు. 1956నుండి సాగవుతున్న తెలంగాణ ఆయకట్టు నీటివరకు అచేస్థాయిలో ఉండగా 2004సంవత్సరం నాటికి ఆంధ్ర ప్రాంతంలో 83.64లక్షల ఎకరాలు ఆయకట్టు సాగవుతుందని

పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగిస్తున్న మాజీ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్‌రావు

అన్నారు. జలయజ్ఞంలో చేపడుతున్న ప్రాజెక్టులు పూర్తయితే ఆంధ్రప్రాంతంలో 132లక్షల ఎకరాలు సాగులోకి వస్తుందని, అప్పుడు తెలంగాణ జిల్లాలకు ప్రస్తుతం కృష్ణా బేసిన్ నుండి అందుతున్న 15శాతం నీటివాటా కూడా తెలంగాణ ప్రాంతానికి దక్కకుండా పోయే ప్రమాదం ఉందని విద్యాసాగర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టును 40కోట్ల రూపాయలతో పెండింగ్ పనులు పూర్తిచేస్తే అదనంగా 5టిఎంటిసిల నీటిని నిలువచేసుకోవచ్చని అన్నారు. ఆర్డిఎస్ కుంధ్రాలను పూర్తిచేయడంతో మహబూబ్‌నగర్ జిల్లాకు దక్కాల్సిన వాటా అందడం లేదని, నుంకేసుల పరిస్థితి సహితం అలాగే ఉందని అన్నారు. కర్ణాటక రాష్ట్రం నుండి కృష్ణా, తుంగభద్ర, పెన్నా నదుల ద్వారా తెలంగాణకు రావాల్సిన వాటా కర్ణాటక రాష్ట్రం అల్‌మట్టి ప్రాజెక్టును నిర్మించి అడ్డుకుందని తెలిపారు. ఇంత జరుగుతున్నా పాలమూరు జిల్లా, తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని, మంత్రులు ఎక్కడ మంత్రి పదవులు పోతాయోనని, మంత్రి పదవులు రానివారు పదవులు దక్కవనే ఉద్దేశంతో ఈ ప్రాంత అభివృద్ధిని పణంగా పెడుతున్నారని విమర్శించారు.

దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందని, పాలమూరు జిల్లాకు ఎత్తిపోతలు తప్ప మార్గం లేదని అన్నారు. నీరే అభివృద్ధికి మూలమని, నీటి వనరులు సమృద్ధిగా ఉన్నప్పుడే ప్రాంతం విద్య, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పాలమూరు జిల్లాలో వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఉన్న వనరులు సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం రానంతవరకు పాలకులు మనలు చేయరని, పాలకులను, ప్రభుత్వాలను నిలదీయాల్సిన అవసరం ఉందని అందుకు మేధావులు, యువకులు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమయిందన్నారు. ఎన్ఆర్ఐ మేరెడ్డి రవిప్రకాష్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యా ఉపాధి అవకాశాలకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి, పంపింగ్ ఇంజనీర్ పెంటారెడ్డి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రంగారెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఓయు ఇంజనీర్ కళాశాల ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, జెఎన్ఎన్ఇ వైస్‌ఛైర్మన్ రవికుమార్ తదితరులుపాల్గొన్నారు.